జీషాన్ హోటల్‌కు రూ. 10 వేల జరిమానా



జీషాన్ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు హోటల్స్‌లలో కార్పొరేషన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అధికారులు, సిబ్బందితో కలిసి ఉదయం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జీషాన్ రెస్టారెంట్‌లో పాడైపోయిన బిర్యానీ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కుళ్లిన చికెన్, మటన్, పాయ తయారీకి ఉపయోగించే మేక కాళ్ల సీజ్ చేసినట్లు తెలిపారు. హోటల్ యాజమాన్యానికి రూ.10 వేలు జరిమానా విధించామని,. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇప్పించాలి



శంషాబాద్ రూరల్: దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని భూములకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని బాధిత రైతులు శుక్రవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఘాంసిమియాగూడకు చెందిన రైతులు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఈ మేరకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. పాసు పుస్తకాలు అందజేసి రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్, మాజీ ఉపసర్పంచు ఇమ్రాన్, నాయకులు మల్లేష్, జంగయ్య, రవీందర్‌గౌడ్, సూజత, మల్లేష్‌గౌడ్, రైతులు సిద్దయ్య, బాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



ఏజీవర్సిటీ: తెలంగాణ సాధనకు నిరంతరం శ్రమించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ద్వారా వద్ద ఉన్న జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. జయశంకర్ సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దులగుట్ట కమాన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్

శంషాబాద్: పట్టణంలోని సిద్దులగుట్ట కమాన్ పనులను మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్ శుక్రవారం పరిశీలించారు. కమాన్ పనులు వేగంగా కొనసాగుతున్న కారణంగా ఆలయానికి వచ్చే భక్తులు వాహనాలను కమాన్ వెలుపలే పార్కింగ్ చేయాలని ఆయన కోరారు. పనులు కొనసాగుతున్నంతవరకు భక్తులు సహకరించాలని కోరారు. త్వరలోనే కమాన్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎంపీకి చిత్రపురి వాసుల వినతి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో చిత్రపురి కాలనీ వాసులు

మణికొండ: చిత్రపురి కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కాలనీ వాసులు కోరారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప ఆధ్వర్యంలో ఎంపీని కలిసిన వారు చిత్రపురి కాలనీలో తాగునీరు, పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు, రోడ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ త్వరలోనే చిత్రపురి కాలనీని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీగా గెలుపొందిన విశ్వేశ్వర్‌రెడ్డిని వారు సన్మానించారు. కార్యక్రమంలో ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. సూర్యనారాయణ, నాయకులు రాజు, ఎం. శ్రీనివాస్, నాగబాబు, కృష్ణ, రవికుమార్‌రెడ్డి, రాంమూర్తి, బాలమురళికృష్ణ, డి. కృష్ణారెడ్డి, కె. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

మియాపూర్: నీట్ పరీక్ష లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దారపు రమేష్ అన్నారు. శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం మియాపూర్ ఎంఏ ఆఫీసులో మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ఫలితాలు తప్పులతడకగా ఉన్నాయన్నారు. దేశంలో వివిధ యూనివర్సిటీలకు ఒకే పరీక్షా విధానం సరైనది కాదన్నారు. నూతన జాతీయ విధానం- 2020 ప్రకారం ప్రవేశ పరీక్షలను సెంట్రలైజేషన్ చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు నష్టపోతున్నారని, దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.



.యోగా చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



కోకాపేటలో..



మణికొండ పంచవటి కాలనీలో..



ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్ కార్యాలయంలో..



యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న శ్రీ అహోబిల జీయర్‌స్వామి



మధుబన్ కాలనీలో యోగా చేస్తున్న మార్నింగ్ వాకర్స్

జీవన విధానం యోగా..

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రపంచానికి యోగాను అందించిన ఘనత భారతదేశానిదేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను అలవర్చుకోవాలన్నారు. ప్రతిరోజు యోగాసనాలు వేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం



ముచ్చింతల్‌లోని స్ఫూర్తి కేంద్రం ఆవరణలో..



ఐసీఎంలో...



శ్రీకొండా లక్ష్మణ్ విశ్వవిద్యాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



మాపల్ టౌన్‌షిప్‌లో..

యోగాతో ఎన్నో ప్రయోజనాలు

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ అకాడమీలో శిక్షణ పొందుతున్న 550 మంది ట్రైనీ ఎస్ఐలు, ఉన్నతాధికారులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మురళీధర్ మాట్లాడుతూ యోగాతో పోలీసులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. పనిలో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా విధులు నిర్వహిస్తారని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఔట్‌డోర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామ్ మూర్తి యోగా విశిష్టత, అందులో భారత దేశ ప్రాధాన్యత వివరించారు. అనంతరం ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ ప్రతినిధి, యోగా మాస్టర్ విశాల్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీలు, డీఎస్పీలు, ట్రైనీ ఎస్ఐలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



యోగా మాస్టర్ విశాల్‌ను సత్కరిస్తున్న అధికారులు



పోలీస్ అకాడమీలో యోగా చేస్తున్న పోలీసులు





సైన్యంతో నవయోగ

మణికొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్సింగి హనుమాన్ దేవాలయం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నవయోగ అకాడమీ ఆధ్వర్యంలో 17వ బెటాలియన్ భారత సైన్యంతో కలిసి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్కొండ బెటాలియన్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ హైమాంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. హైదరాబాద్‌లోని ఏడు కేంద్రాల ద్వార యోగాను ప్రచారం చేయటంలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని సంస్థ వ్యవస్థాపకులు కె.నవీన్ తెలిపారు. కార్యక్రమంలో 17వ బెటాలియన్‌కు చెందిన వందలాది మంది సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నార్సింగి 17వ బెటాలియన్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న సైనిక కుటుంబాలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శుక్రవారం మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్‌ను నియమించి వారికి ఇచ్చే గౌరవ వేతనం పెంచాలన్నారు. అనంతరం మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగుల వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో అన్ని పాఠశాలలు సందర్శిస్తామని సమస్యలు స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు పటిష్టతకు అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడుం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టండి



కల్వర్ట్‌లో మంచినీటి పైపులైన్

రాజేంద్రనగర్: కల్వర్ట్‌లోని మంచి నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మంచినీరు వృథాగా పోతుంది. మంచినీటి సరఫరా నిలిచిపోగానే కల్వర్ట్‌లోని మురుగునీరంతా మంచినీటి పైపులైన్‌లోకి చేరుతుంది. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ పీజీ వసతి గృహం వద్ద రోడ్డు పక్కన ఉన్న కల్వర్టు గుండా మంచినీటి పైపులైన్ వేశారు. కల్వర్ట్‌లో చెత్త చెదారాలను నిండి ప్రస్తుతం దుర్గంధ భరితంగా మారింది. దీనికితోడు మంచినీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మంచి నీరంతా కల్వర్ట్ వద్ద నిలిచిపోతుంది. సరఫరా నిలిచిపోగానే కల్వర్ట్‌లోని నీరంతా తిరిగి లీకేజీ ఏర్పడిన రంధ్రం గుండా పైపులైన్‌లోకి వెళుతుంది. దీంతో కలుషిత నీరు సరఫరా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వరి పంట అభివృద్ధికి రెయిన్ అవుట్ షెల్టర్



రెయిన్ అవుట్ షెల్టర్‌కు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: వరి సాగు సంబంధించిన పరిశోధనలు నిర్వహించి వరి పంట రకాలను అభివృద్ధి చేసేందుకు రెయిన్ అవుట్ షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎం సుందరం , ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ప్రకాశ్ తెలిపారు. భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నేరుగా వరి విత్తే పద్ధతిని అభివృద్ధి చేసేందుకు రెయిన్ అవుట్ షెల్టర్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రస్తుతం వరి సాగులో కూలీల కొరతతో పాటు పెట్టుబడికి చాలా ఖర్చు అవుతుందని వరి సాగు నేరుగా విత్తే పద్ధతి ద్వారా కూలీల సమస్య తప్పుతుందని ఖర్చు తగ్గి పంట కాలం 10 రోజులు తక్కువ అవుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఫలితాలు తెలంగాణ రాష్ట్రంలోని చిన్న సన్నకారు రైతులందరికి ప్రయోజనకరంగా ఉన్నాయని, భవిష్యత్‌లో దేశంలోని రైతాంగానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్రీడా డైరెక్టర్ వి కె సింగ్, ఐఐఓఆర్ డైరెక్టర్ వై మాథుర్,,ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి, అటారీ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాల ఆందోళన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రధాన గేటు ముందు శుక్రవారం సాయింత్రం పలు విద్యార్థి సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళనలో ఏఐటీసీఎస్‌ఏ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ ఎంట్రెన్స్ పరీక్షను విడిగా నిర్వహించాలని నినాదాలు చేశారు. ఏఐటీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీలపై పూర్తి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. యూజీసీ నెట్‌ను రద్దు చేసి దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీల్లో పీహెచ్‌డీ ఎగ్జామ్స్ కండక్ట్ చేసేలా ప్రభుత్వం చూడాలని వారు డిమాండ్ చేశారు.

రేసింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో బైక్, కారు రేసింగ్‌లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మాదాపూర్ ఏసీపీ సీహెచ్.శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం రాయదుర్గం పీఎస్‌లో బైక్ రేసింగ్‌లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనర్లు బైక్ రేసు చేసినట్లయితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. బైక్ రేస్‌ల కారణంగా వాహనదారులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, శబ్ద కాలుష్యంతో భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు నాలెడ్జ్ సిటీలోని టీ హబ్ జంక్షన్‌లో రేస్‌లు నిర్వహించిన 89 బైక్‌లు, రెండు కార్లను సీజ్ చేశామని తెలిపారు. 9 కేసులలో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మరో నలుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. బైక్, కారు రేస్‌లను అరికట్టేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న, ఎస్ఐలు మన్మదరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వాలు మారినా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగిలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో గండిపేట మండలం, మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 80 మందికి, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 84, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 25 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వాల ధ్యేయమన్నారు. గత ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టామని, అదే తరహాలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలన్నారు. ప్రజల మన్ననలు అందుకునేలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెవరేర్చాలని కోరారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నయాబ్ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ విక్రంరెడ్డి, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే రాణింపు...

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థి దశలోనే కెరీర్ నిర్మాణంలో భాగంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి సదా సిద్ధంగా ఉండాలని, అప్పుడే తమను తాము తీర్చిదిద్దుకోగలుగుతారని విద్యారంగ, పారిశ్రామిక రంగ నిపుణులు అన్నారు. నగరానికి చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (ఐఎమ్‌టీ) ఆధ్వర్యంలో అభ్యుదయ్ మేనేజ్‌మెంట్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను నూతనంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా పరిశ్రమతో అనుబంధంగా కొనసాగే రెండు ఇండస్ట్రీ ట్రాక్ పీజీడీఎమ్ కోర్సులను పరిచయం చేశారు.

కార్యక్రమంలో ఐఎమ్‌టి డైరెక్టర్ శ్రీహర్షారెడ్డితో పాటు అరబిందో ఫార్మా డైరెక్టర్ డా.శాతకర్ణి మక్కపాటి, డాక్టర్ రెడ్డీల్యాబ్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డా.రవిప్రకాష్ మాధుర్ తదితర పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు.